# జలక్రీడలు

లాలలుపోసి, పవుడర్లు రాసి, బొట్టూ కాటుకాబెట్టి ముస్తాబు చేస్తే ఎత్తుకుందుకు పిల్లలు ముద్దొస్తారు కాని వాళ్ళు పేచీలు పెట్టి ఏడుపు లంకించుకుంటే అమ్మ పెట్టేవి రెండూ పెడితేగాని వూరుకోరు. పిల్లలు భగత్స్వరూపులు అంటారేకాని దేవుళ్ళ పక్కలో వుచ్చలుపోయరు కదా. ముక్కమ్మటా మూతమ్మటా చీముళ్ళు చొంగలు కారుస్తూ వస్తే దేముళ్ళనైనా వీప్మీద రెండు అంటించని తల్లులంటూ వుండరు యీ భూప్రపంచంలో. ఓల్ ఇండియా మొత్తంమీద పిల్లల పేచీలు తీర్చడానికి తల్లే సుప్రీం కోర్టూ, తల్లే చీప్ జస్టిస్సూ. తల్లే అన్యాయవాది కావాలిగాని మరోరు కావటానికి వీలేది? ప్రెసిడెంటాఫిండియా కూడా పిల్లల తగూల్ని తీర్చలేడని వెనకెక్కడో రాశాను. చెప్పొచ్చేదేవిటంటే పిల్లల్ని పెంచటంలో వాళ్ళ తగూల్ని, వాళ్ళ యేడువుల్ని. వాళ్ల అల్లర్లని భరించి సముదాయించేటప్పటికి "హాసిఫ్‌కి తలప్రాణం తోకలోకి వస్తుంది. (ఆడవాళ్లకి తోకలుండవనుకోండి.) ఒకవేళ వుంటే తోకలోకి వచ్చినట్టు గిలగిలా కొట్టుకువస్తుందన్నమాట. చావదనుకోండి. చచ్చినంత పనవుతుంది. పిల్లవాళ్ళకి లాజిక్కూ తెలియదు. రూల్సూ తెలియవు. ఆమాటకొస్తే తల్లుల కూడా

"రూల్సా-లాజిక్కా" తెలియవు-పడాపడా బాదెయ్యటం, తప్ప మా వాటా పక్కనో మొద్దు రాచిప్ప వుందిలెండి. అది అప్పుడప్పుడు కొరడారాణి అవతారం ఎత్తుతూ వుంటుంది. దానికి ఓ చదువూ చట్టుబండలూ రాదు. దానికో చీవిడి ముక్కు కొడుకున్నాడు. వాడు కాళ్ళూ చేతులూ వున్న బూడిద గుమ్మడికాయలా వుంటాడు, వాడికది అంట్లుతోముతూ అంటచేత్తో బాత్తూ. చదువు చెబుతుంది, చదువంటే చదువనుకునేరు, బోడి ఒంట్లు మాత్రమే—చదువు చెప్పమంటే నెత్తిమీద చిల్లడేలా పలకతో బాదటం, వేళ్ళమీద తిరగేసి గరిటతో కొట్టడం, కొరకంచుతో వాతలు పెట్టడం అన్న మాట, ఈ హింస భరించలేక వాడు గగ్గోలుపడిపోయి గావుకేకలు పెడు తూంటాడు. ఆ అక్షరాలొచ్చే సరికి దీని చేతిలో చస్తాడని మేమంతా అను కుంటాం. పవిత్రమైన తల్లి గరిటకాల్చి పవిత్రంగా వాతలు పెడుతున్న ప్పుడు అడ్డెళ్ళటానికి మనమెవరం? ఎవరైనా మావారిలాటి వాళ్ళు దూకు డుగా వెళ్ళి నీ మొగం మండ నీకిదేంబుద్ధే—పసివెధవని చంపువావా, నీ చదువు చట్టుబండలు కాను" అంటే అది ఫ్రీమేల్సుతో మాట్లాడినందుకు దానికి పాతివ్రత్యం అంతా పోయినట్టే కేకలు పెడుతుంది. దాని పాతివ్రత్య మహాత్మ్యానికి వెరచి అది జరిపే హింసాకాండను అడ్డుకోరు. ఇలాటి పతి వ్రతలకు మనదేశంలో లోటులేదు.

మొన్న దాని కొడుకూ మా చివరి వెధవా కలిసి ఓ వెధవ పని చేసొచ్చారు. మా క్రింద వాటా రాజ్యలక్ష్మి బి. ఏ. ఫర్టియ్యరు మంచం మీద పడుకుని వీక్లీ శ్రద్ధగా చదువుకుంటోందట- పైనుంచి నీళ్ళు పడ్డా యట. నీళ్ళు కావపటుందమ్మాయి. వీళ్ళ మేం ఉచ్చలు పొయ్యలేదంటారు. పొయ్యకపోతే పోశారనడం నాకేం సరదా - అని ఆ అమ్మాయి గొడవ చేసింది. అప్పుడా అమ్మాయిని బతిమాలి బాతూంలోకి తీసికెళ్లి తలంటు పొయ్యాలిసొచ్చింది. అప్పుడే మావారొచ్చి వాళ్ళమ్మాయి మనింట్లో తలంటు కుంటోందెందుకు అని అడిగారు.మీరవతలకెళ్ళండి- మీకెందుకు అన్ని విష

యాలా అని ఆ పిల్ల వింటూండగానే కోప్పడ్డాను. ఏవర్రా వెధవల్లారా రాజ్యలక్ష్మి మీద ఎందుకు పోశారని అడిగితే — దొడ్లో ఆడుకుంటూంటే కొట్టిందని ఫిర్యాదు, ఏవమ్మా రాజ్యలక్ష్మి అంటే గుమ్మాని కెదురుగా అసహ్యంగా కూర్చుంటున్నారని బెదిరించానంది.

మా పొరుగున బామ్మగారి బుల్లి మనమడు కాగుతున్న చారులో



కాస్తా పోసేశాడ్ట—ఎవరూ చూడలేదు. ఆవిడ వడ్డించేసిందట. చిన్నపిల్లాడే కదా—వాడి శరీరంలో ఏ దోషమూ వుండదు. పైగా చారుకదా ఏం తెలుస్తుంది. పిల్లలు భగవత్స్వరూపులు అంటుదావిడ. వాడోసారి మెంతికాయ జాడీలో పోసేశాడ్ట—వాళ్ళమ్మ లబోదిబోమంది. ముసలావిడ పైది తీసేస్తే ఫరవాలేదు చద్దన్నాల్లోకి పనికొస్తుందంటుందట.

చూడండి మా అత్తగారి చాదస్తం....చారు తినిపించేసినట్లే ఈవిడ

మనవడి పవిత్రాన్ని కూడా అందరికీ నైవేద్యం పెట్టేటట్లున్నారు అంది, ఆ పిల్లవాడు మంచినీళ్ళ బిందెలోనూ, కాళీ బొక్కెనల్లోనూ, కూరపు బుట్టల్లోనూ, బియ్యపు చేటల్లోనే తప్పపోయడు, తెలిసిన వాళ్ళకి యింట్లో కాఫీ తాగాలన్నా చచ్చేభయం. మావారికి చెబితే వాడు చాలా చురుకైన వాడు పైకొస్తాడంటారు. సరే - పైకొస్తే వాడి పెళ్ళాం సుఖపడుతుంది. అంతాకా ఆవు పంచకంలా వీడు పోసేది నెత్తిమీద జల్లుకోవాలా అని విసుక్కుంటే నవ్వుతారు.

మా చంటివాడు కూడా నెలప్పుడు నీళ్ళోస్తూంటే మా ఆడపడుచు నోట్లోపడేలా చిమ్మేశాడు. ఆవిడ ఉక్కిరిబిక్కిరయితే అంతా మేనల్లుడే గదా పరవాలేదమ్మ అని వుడికించారు. ముఖ్యంగా మగపిల్లలు ఆదో విద్య అనుకుంటారు. పసిపిల్లలు అనుకోకుండా పోసేస్తారు కనుక ఆ గంగా ప్రవాహం ఎటువైపు నుంచి ఎటువస్తుందో తెలీదు. ఒకప్పుడు కాళ్ళాడిస్తూ చేతులుతడుతూ వాళ్ళ మొహంమీద పడేలా వాళ్ళే పోసుకుంటూ జల క్రిడలాడతారు. ముఖ్యంగా అమ్మమ్మలకూ,నాయనమ్మలకూ ఈ జలక్రీడలు చూడటం చెప్పుకోటం గొప్ప సరదా. కాలేజీ అమ్మాయిలు అందుకే పిల్ల లెత్తుకోవటానికి భయపడతారు. తల్లయాక ఈ అమ్మాయే తన పిల్లాడికి ఒక్క రోజు విరోచనం కాకపోతే బిక్క మొహం పెట్టుకుంటుంది. ఎప్పుడూ పాత గుడ్డలూ, చీపురూ. బాల్చి ఒకచేత్తో చంటిపిల్లాడ్ని పెట్టు కుని దర్శనమిచ్చే తల్లి రూపంలో అమ్మాయిల్ని చూసినప్పుడల్లా నాకు జాలికి జాలీ అభిమానానికి అభిమానం కలుగుతుంది వారిపట్ల. సినిమాల్లోనూ, నవల్లోనూ, పార్కులో పరిగెత్తడాలు డ్యూయట్లు చూపిస్తారేకాని ఈసీనులు చూపించరు. సెన్సారు వాళ్ళొప్పుకోరు కాబోలు. ఒప్పుకోని సీనులు సంసారాల్లో జరగటంలేదా? ఏమైనా ప్రేమ వెనకాల పెళ్ళి.దానివెనకాలే పిల్లలూ పీతుళ్ళూ వుచ్చలూ వస్తాయి. కవులూ రచయితలూ ప్రేమ గురించీ త్యాగాల గురించీ మమతల గురించీ చెబుతారేగాని ఈఅదర్ సైడు చెప్పరు. చెపితే లవ్ సీను సొగసు చెడిపోతుందని వారి భావన. పెళ్ళి

తరువాత ఆడది డిజల్యూషన్ పొందడానికి ఆమె చేతులకి బాల్చీ, చీపురు కట్టా ఆలుగుడ్డా అంటుకు పోవడమే కారణం. జీవితంలో దొరకని మధుర స్వప్నాల వెంట పరిగెత్తటంలోని అంతరార్థం ఇదే— చీపురు కట్టను, ఆలుగుడ్డనూ, నీళ్ళబొక్కెన్నూ వదలని ఇల్లాలిని చూసి అవి చేతిలో ధరించని అమృతపాణి కోసం మగాడు వీధిలోకి పరిగెట్టడంలోని అంతరార్థం ఇదే–ముసలమ్మలు మాత్రం మడవడి పవిత్రోదక స్పర్శ మాత్రం చేత పునీతులమైనట్లు భావిస్తారు. ఒకరి స్వప్నం మరొకరికి దుఃఖం కదా!